

గోవిందరావుపేట : పోస్టు కార్డులతో నిరసన తెలుపుతున్న ఉద్యమకారులు

## రేవంత్ సారు హామీలు ఏమయ్యాయి ?

### పోస్టు కార్డు ఉద్యమాన్ని ప్రారంభించిన ఉద్యమకారులు

గోవిందరావుపేట/ వెంకటాపూర్, ఫిబ్రవరి 21 : ఎన్నికల ముందు తెలంగాణ ఉద్యమకారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు నేటికీ అమలు కాకపోవడంపై శుక్రవారం ఉద్యమకారులు 'రేవంత్ సారూ మా హామీలు ఏమయ్యాయని' పోస్టు కార్డు ఉద్యమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యమకారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంటి భద్రయ్య, గోవిందరావుపేట మండల అధ్యక్షుడు మెడుదుల వెంకన్న మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పోరాడిన ఉద్యమకారులకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గుర్తింపు కార్డు, 250 గజాల ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇండ్లలో మొదటి ప్రాధాన్యత ఇస్తామని చెప్పిందన్నారు. నేటికి 14 నెలలు కావస్తున్నా ఒక్క హామీ కూడా నెరవేర్చకపోవడం బాధాకరమన్నారు. ఉద్యమకారుల సంక్షేమ బోర్డు కోసం రూ.10 వేల కోట్లు కేటాయించాలని కోరుతూ పోస్టు కార్డు ద్వారా సీఎంకు విన్నవిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి దర్శనాల సంజీవ, కొండి రమేశ్, రేండ్ల శ్రీనివాస్, బైకాని ఓదేలు, యాస పూలమ్మ, సామ సరోజన, వెంకటాపూర్ మండల కమిటీ అధ్యక్షుడు దగ్గు ప్రభాకర్‌రావు, ఉద్యమకారులు అబ్బా గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఎండీ రహీమొద్దీన్, మాజీ ఎంపీటీసీ గాజుల శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి, రాములు, రమేశ్, భద్రయ్య పాల్గొన్నారు.

## రామప్పను సందర్శించిన ఆర్కియాలజీ విద్యార్థులు

వెంకటాపూర్, ఫిబ్రవరి 21 : కేంద్ర పురావస్తు శాఖ ఆధ్వర్యంలో గ్రేటర్ నోయిడాలో శిక్షణ పొందుతున్న ఆర్కియాలజీ విద్యార్థులు శుక్రవారం రామప్ప దేవాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు పురావస్తు శాఖ అధికారులతో కలిసి రామలింగేశ్వరుడికి పూజలు చేశారు. వారికి అర్చకులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ విశిష్టత, కాకతీయుల చరిత్ర, రామప్ప కట్టడానికి వాడిన మెటీరియల్, కట్టడం ప్రత్యేకతలు అధికారుల ద్వారా తెలుసుకున్నారు. వారి వెంట కేంద్ర పురావస్తు శాఖ అధికారులు అసిస్టెంట్ ఆర్కియాలజీ సూపరింటెండెంట్ ఆశీష్ రంజన్ సాహూ, ఆర్కియాలజీ ఇనిస్టిట్యూట్ ప్రొఫెసర్ పండిత్ దీన్ దయాల్, అసిస్టెంట్ ఆర్కియాలజీ ఏఈ సాయికృష్ణ, సీనియర్ ఫొటో గ్రాఫర్ సుభాష్‌చంద్, సీఏ నవీన్, ఫోర్‌మెన్ ప్రదీప్‌బాబు ఉన్నారు.

## మానవత్వ చాటుకున్న గణపురం ఎస్సై



యువకుడిని ఆసుపత్రిలో చేర్పిస్తున్న ఎస్సై అశోక్

గణపురం, ఫిబ్రవరి 21: రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడిని గణపురం ఎస్సై రేఖ అశోక్ తన వాహనంలో భూపాలపల్లిలోని 100 పడకల దవాఖానకు తరలించి మానవత్వాన్ని చాటుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని కర్కపల్లి గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి తన మిత్రుడితో కలిసి గణపురానికి బైక్‌పై వస్తుండగా గాంధీనగర్ వద్ద ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను తప్పించబోయి కిందపడ్డాడు. దీంతో తలకు బలమైన గాయమై చెవి నుంచి రక్తస్రావమైంది. అదే సమయంలో ఎస్సై అశోక్ వెళ్తుండగా బాధితుడిని తన వాహనంలో భూపాలపల్లి దవాఖానకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కృష్ణారెడ్డిని వరంగల్‌కు తరలించామని, ఆయన పరిస్థితి నిలకడగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సకాలంలో స్పందించిన ఎస్సై అశోక్, కానిస్టేబుల్ రాజు, డ్రైవర్ రాములను కుటుంబ సభ్యులు, ప్రజలు అభినందించారు.

## వసతి గృహంలో కలెక్టర్ నిద్ర

మొగుళ్లపల్లి, ఫిబ్రవరి 21 : మండలకేంద్రంలోని మహాత్మా జ్యోతి బా పూలే బాలుర గురుకుల పాఠశాలను కలెక్టర్ రాహుల్‌శర్మ ఆకస్మికంగా తనిఖీ చేసి వసతి గృహంలో నిద్ర చేశారు. అంతకు ముందు వంట గదులు, పాఠశాలను పరిశీలించి ప్రిన్సిపాల్‌ను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మంచినీరు తక్కువగా వస్తుందని తెలుపగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని, నూతన బోరుకు ప్రతిపాదనలు పెట్టాలని సూచించారు. వీధి దీపాలు, ఫ్యాన్స్ ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రతి విద్యార్థి వివరాలు ఆపార్ చేయాలని సూచించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో కలిసి భోజనం చేసి విద్యార్థులతో మాట్లాడారు. ఐఏఎస్ అధికారిగా ప్రజలకు సేవలు అందిస్తామని చెప్పిన షణ్ముక్ అనే విద్యార్థిని అభినందించారు. ఆయన వెంట మండల స్పెషలాఫీసర్ సునీత, తహసీల్దార్ సునీత, ఎంపీడీవో హుస్సేన్, ఆర్‌ఐ సురేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ శారద ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
★I OOKANTI SAMBA REDDY (New Name) H.No. 1-120, Tirumalagiri (V), Regonda (M), Jayashankar Bhupalpally Dist. T.G., Have changed my name from OOKANTI SAMBAIAH to OOKANTI SAMBA REDDY S/o OOKANTI MUKUNDA REDDY.
NTW-000

CHANGE OF NAME
★I, SAMPATH KUMAR (Old Name) H.NO.5-9-88 to 91, Lahari Legend Apartment, Kishanpura, Hanumakonda-Dist-500001, T.S. have changed my name from SAMPATH KUMAR to THALLA SAMPATH KUMAR(New Name) S/o. TALLA VARDARAJULU for all purposes.
NTW-5528


గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

CHANGE OF NAME
★I, VARSHINI (Old Name) H.NO.5-9-88 to 91, Lahari Legend Apartment, Kishanpura, Hanumakonda Dist-506001, T.S have Changed my name from VARSHINI to THALLA VARSHINI DHANALAXMI (New Name) W/o. THALLA SAMPATH KUMAR for all purposes.
NTW-5528

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

# పంటలు ఎండిపోకుండా చర్యలు చేపట్టాలి

- ఎరువుల కృత్రిమ కొరత సృష్టిస్తే పీడీ యాక్టు నమోదు చేయండి
- భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ



సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 21 : యాసంగి పంటకు అవసరమైన నీటి కోసం తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌శర్మ వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీవోసీ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించి మాట్లాడారు. పంటకు అవసరమైన నీటి సరఫరా కోసం తగిన చర్యలు తీసుకోవాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో నీటి పరిస్థితి, కాలువల ద్వారా నీటి సరఫరా, భూగర్భ జలాల స్థితిగతులు తదితర అంశాలను అధికారులు పరిగణలోకి తీసుకొని పంటలు ఎండిపోకుండా చూడాలన్నారు. జిల్లాలో ఎస్సారెస్పీ నుంచి సరఫరా అయ్యే నీటి వల్ల రేగొండ, చిట్యాల మండలాల రైతులకు మేలు జరుగుతుందని తెలిపారు. జిల్లాలో గత యాసంగి సీజన్లో 86 వేల ఎకరాల్లో పంట సాగైందని, ఈ సీజన్‌లో 82 వేల ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉందన్నారు. నీటి అక్రమ వినియోగాన్ని అరికట్టేందుకు పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు. యూరియా కొరత రాకుండా నిరంతరం పర్యవేక్షించాలని, టాస్క్ ఫోర్స్ టీములు ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తూ స్టాకు వివరాలు పరిశీలించాలని ఆదేశించారు. వ్యాపారులు ఎరువుల నిల్వ వివరాలు నోటీస్ బోర్డ్ పై ప్రదర్శించాలన్నారు. జిల్లాకు 25 వేల టన్నుల యూరియా వచ్చిందని, అదనంగా 5 వేలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఆధార్ నమోదుతో మాత్రమే యూరియా ఇవ్వాలని సూచించారు. కృత్రిమ ఎరువుల కొరత సృష్టిస్తే పీడీ యాక్టు నమోదు చేయాలని ఆదేశించారు.

### రెండో విడత శిక్షణ 24న నిర్వహిస్తాం

జిల్లాలో పోలింగ్ స్లిప్పుల పంపిణీ 90 శాతం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ తెలిపారు. ఫిబ్రవరి 27న నిర్వహించనున్న ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల ఏర్పాట్లపై శుక్రవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడారు. జిల్లాలో పోలింగ్ స్లిప్పుల పంపిణీ 90 శాతం జరిగిందని, శనివారం వరకు మిగిలిన 10 శాతం పూర్తి చేస్తామని తెలిపారు. భూపాలపల్లి డివిజన్‌లో 7, కాటారం డివిజన్‌లో 10 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, సిబ్బందికి మొదటి విడత శిక్షణ ఇచ్చామని, రెండో విడత శిక్షణ 24న నిర్వహిస్తామని వివరించారు. పోలింగ్ మెటీరియల్ పంపిణీ, రిసెప్షన్ కేంద్రాలను ఐడీవోసీ కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్నామని, 35 పోలింగ్ బాక్సులు సిద్ధం చేసినట్లు తెలిపారు. పోలింగ్ మెటీరియల్ రవాణాకు నాలుగు రూట్లు ఏర్పాటు చేస్తున్నామని, ఐడీవోసీ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ వినియోగానికి ఓటరు ఫెలిసిటేషన్ కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, వ్యవసాయ శాఖ అధికారి విజయ్ భాస్కర్, ఇరిగేషన్ ఈఈలు బసవప్రసాద్, యాదగిరి, తిరుపతిరావు, ఇరిగేషన్ ఏఈలు, వ్యవసాయ శాఖ ఏఈవోలు, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎన్నికల విభాగం డీటీ అబ్బాస్, సిబ్బంది నవీన్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

### ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ దివాకర

ములుగురూరల్, ఫిబ్రవరి 21 : వరంగల్, ఖ మ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పీవో, ఏపీవోలకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో కలెక్టర్ పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలతో పోల్చితే శాసన మండలి ఎన్నికల పోలింగ్ ప్రక్రియ భిన్నంగా ఉంటుందని, దానిపై అధికారులు పూర్తి అవగాహనను కలిగి ఉండాలని అన్నారు. ఈ నెల 27న ఉదయం 8 నుంచి 4 గంటల వరకు జరిగే పోలింగ్ ప్రక్రియలో ఎలాంటి అవంతరాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. సమావేశంలో కలెక్టరేట్ ఏవో రాజ్‌కుమార్, తహసీల్దార్ విజయ్‌భాస్కర్, పర్యవేక్షకులు సలీం, శికుమార్ పాల్గొన్నారు.

### మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించాలి

మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అధికారులు యువతతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ దివాకర అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మాదక ద్రవ్యాల నిషేధాన్ని అమలు చేస్తూ ప్రతీ వారం అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. జిల్లాలో గంజాయి సాగు జరగకుండా అన్ని శాఖల అధికారులు దృష్టి సారించాలని సూచించారు. కళాశాలల్లో యాంటీ డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ఆర్డీవో వెంకటేశ్, డీసీఆర్‌బీ డీఎస్పీ కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

### గురుకులాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

జాకారం సోషల్ వెల్ఫేర్ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలను శుక్రవారం రాత్రి కలెక్టర్ దివాకర ఆకస్మిక తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు, అధ్యాపకుల, విద్యార్థుల హాజరు పట్టిక, విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం డార్మెటరీ హాల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. టెన్త్ విద్యార్థులకు మ్యాథ్స్ క్లాసులు చెప్పారు.

## ఆశించిన స్థాయిలో ఉత్పత్తి లేదు

### సింగరేణి డైరెక్టర్ సూర్యనారాయణ



ఓసీ-3 ప్రాజెక్టును పరిశీలిస్తున్న సూర్యనారాయణ

కృష్ణకాలనీ, ఫిబ్రవరి 21 : సింగరేణి భూపాలపల్లి ఏరియాలో సంస్థ ఆశించిన స్థాయిలో బొగ్గు ఉత్పత్తి కావడం లేదని, ఉద్యోగులు, కార్మికులు సమష్టిగా పనిచేసి సంస్థ ఆశించిన లక్ష్యాన్ని నెరవేర్చాలని సింగరేణి డైరెక్టర్ (ఆపరేషన్స్) ఎల్‌వీ సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏరియా జీఎంతో పాటు అన్ని గనుల ఏజెంట్లు, హెచ్‌వోడీలతో ఉత్పత్తి, ఉత్పాదకత అంశంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణ మాట్లాడుతూ భూపాలపల్లి ఏరియాలో ఉత్పత్తి శాతం ఆశించినంత లేదన్నారు. ప్రతి గనిలో కార్మికుల హాజరు శాతం లక్ష్యాలను చేరుకోవడం ఎంతో ప్రధానమైనదన్నారు. ఉత్పత్తి లక్ష్యాలు చేరుకోవడానికి ఏవైనా ఇబ్బంది ఉన్నాయా ? అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశ అనంతరం కేటీకే ఓసీ-3 ప్రాజెక్ట్‌ను సందర్శించి ఉత్పత్తి వివరాలు తెలుసుకున్నారు. సమావేశంలో జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఎస్‌వోటు జీఎం కవీంద్ర, ఏరియా అధికార ప్రతినిధి, ఏరియా పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి, కేటీకే ఓసీ-2 ప్రాజెక్ట్ అధికారి వెంకటరామరెడ్డి, ఏరియా ఇంజినీర్ రామకృష్ణారెడ్డి, కేటీకే- 1 గ్రూప్ ఏజెంట్ వెంకటరమణ, డీజీఎం సివిల్ రవికుమార్, కేటీకే ఓసీ-3 ప్రాజెక్ట్ అధికారి భిక్షమయ్య పాల్గొన్నారు.

## హత్యా రాజకీయాలు మానుకోవాలి

టేకుమట్ల/ మొగుళ్లపల్లి, ఫిబ్రవరి 21 : కాంగ్రెస్ నాయకులు హత్యా రాజకీయాలు మానుకోవాలని బీఆర్‌ఎస్ టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాల అధ్యక్షులు సట్ల రవి గౌడ్, బల్గురి తిరుపతిరావు అన్నారు. శుక్రవారం వారు వేర్వేరుగా నిర్వహించిన సమావేశాల్లో మాట్లాడారు. భూపాలపల్లిలో జరిగిన రాజలింగమూర్తి హత్య భూతగాదాల వల్ల జరిగిందని మృతుడి భార్య ఫిర్యాదు చేయగా, కాంగ్రెస్ నేతలు మా త్రం మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, కేసీఆర్, కేటీఆర్ హరీశ్ రావుపై నిందలు వేయడం తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మతి భ్రమించి మాట్లాడుతున్నాడన్నారు. సంక్షేమ పథకాలు అమ లు చేయడంలో విఫలమైన ప్రభుత్వం ప్రజల్లోని వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడానికి శవ రాజకీయాలు చేస్తున్నదన్నారు. హత్యపై సమగ్ర విచారణ జరిపి దోషులను శిక్షించాలని పోలీస్ అధికారులు, ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ మండల ప్రధాన కారదర్శి అకునూరి తిరుపతి, ఉపాధ్యక్షుడు బొడ్డు సదానందం, బండెల నరేశ్, పింగిలి వెంకటేశ్వర్‌రెడ్డి, ఉద్దమారి మహేశ్, నల్లబెల్లి నవీందర్, లింగంపల్లి ప్రభాకర్‌రావు, మారం లింగారెడ్డి, గువ్వాడి లక్ష్మణ్, ఇండ్ల మల్లేశ్ పాల్గొన్నారు.

## 24న జీసీసీ పాలకమండలి ఎన్నికలు

మహదేవపూర్ (కాళేశ్వరం), ఫిబ్రవరి 21 : గిరిజన ప్రాథమిక సహకార మార్కెటింగ్ సంఘం పాలకమండలి ఎన్నికలు ఈ నెల 24న మండలకేంద్రంలోని మాడా విశ్రాంతి భవనంలో నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి శైలజ తెలిపారు. శుక్రవారం మండలకేంద్రంలోని జీసీసీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఐదుగురు పాలవర్గ స్థానాలకు జనరల్ (3), మహిళా కేటగిరీలో (2) రిజర్వేషన్లు ఖరారు కాగా, మొత్తం 11 నామినేషన్లు వచ్చాయన్నారు. అందులో మహిళలు 2, పురుషులు 9 మంది నామినేషన్ వేశారన్నారు. మహిళా కేటగిలో రెండు డైరెక్టర్లు ఏకగ్రీవం అయ్యాయని, మిగతా 3 జనరల్ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓటర్లు ప్రభుత్వ గుర్తింపు ఉన్న ఏదేని కార్డు వెంట తీసుకురావాలని సూచించారు. పోలింగ్ ముగిశాక ఓట్ల లెక్కింపు చేసి అదే రోజు సాయంత్రం ఫలితాలు వెల్లడిస్తామన్నారు. జీసీసీ మేనేజర్ దేవానాయక్ ఉన్నారు.

## మెనూ ప్రకారం భోజనం అందించాలి

### డీఎల్‌పీవో వీరభద్రయ్య

మహదేవపూర్, ఫిబ్రవరి 21 : విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌పీవో వీరభద్రయ్య మధ్యాహ్న భోజన నిర్వాహకులను ఆదేశించారు. శుక్రవారం ఆయన సూరారం ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. భోజనం, వంట గది, ఆహార నిల్వలను పరిశీలించారు. తరగతి గదులను పరిశీలించి సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంబట్‌పల్లి జీపీని సందర్శించి రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించారు. నర్సరీ పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. గ్రామంలో క్రమంతప్పకుండా పారిశుద్ధ్య నిర్వహణ చేపట్టాలని కార్యదర్శి రమేశ్‌ను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీవో ప్రసాద్, ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

## అటవీశాఖ చెక్ పోస్టు వద్ద ఫాస్టాగ్ ట్రయల్ రన్

ఏటూరునాగారం, ఫిబ్రవరి 21 : మండలకేంద్రంలోని అటవీశాఖ చెక్ పోస్టు సమీపంలో ఏర్పాటు చేస్తున్న ఫాస్టాగ్‌ను శుక్రవారం ట్రయల్ రన్ చేశారు. ఇక్కడ చెక్ పోస్టు వద్ద వాహనాల నుంచి మాన్యువల్‌గా లారీలు, భారీ వాహనాల నుంచి రుసుము వసూలు చేస్తున్నారు. కాగా, ప్రస్తుతం ఇదే స్థానంలో ఫాస్టాగ్ ద్వారా డబ్బులు వసూలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. వారం, పది రోజుల్లో ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి కాగానే ప్రారంభిస్తామని ఎఫ్‌ఆర్‌వో అబ్దుల రెహమాన్ తెలిపారు.

## 323 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

గోవిందరావుపేట, ఫిబ్రవరి 21 : అక్రమంగా తరలిస్తున్న 323క్వింటాళ్ల 50కిలోల పీడీఎస్ బియ్యాన్ని పస్రా ఎస్సై కమలాకర్ పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని మొద్దులగూడెం శివారులో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గుండాల నుంచి మొద్దులగూడెం వైపుసు వస్తున్న లారీ బియ్యం లోడ్‌తో అనుమానాస్పదంగా కనిపించిందన్నారు. తనిఖీ చేయగా 668 బస్తాల లోడ్‌తో పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. తాను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందుకు చెందిన వల్లెపు బంగారి అని తెలిపాడన్నారు. బియ్యం విషయమై ప్రశ్నించగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు మండలం లచ్చగూడెం గ్రామానికి చెందిన బత్తుల రాజుకు చెందినవని, ఇల్లందు చుట్టు పక్కల గారమాల నుంచి పీడీఎస్ బియ్యం తక్కువ ధరకు కొనుగోలు చేసి మహారాష్ట్రలోని నాగపూర్‌లో అధిక ధరకు విక్రయించనున్నట్లు తెలిపారు. పట్టుకున్న బియ్యం విలువ రూ.6.47 లక్షలు ఉటుందని ఎస్సై తెలిపారు. బియ్యంతో పాటు లారీని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కాగా, ఈ నెల 13న సైతం 300 క్వింటాళ్ల బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## మహిళలు ఆర్థికాభివృద్ధిని సాధించాలి

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 21 : మహిళా సంఘాల సభ్యులు రుణాలు తీసుకొని ఆర్థికాభివృద్ధిని సాధించాలని అదనపు కలెక్టర్ విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం భూపాలపల్లిలో జిల్లా సమాఖ్య సమావేశం నిర్వహించగా ఆమె హాజరై మాట్లాడారు. ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తిలో భాగంగా మహిళా సంఘాలు, సభ్యులకు రుణాలు అందజేస్తున్నట్లు చెప్పారు. మహిళలు రుణాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివద్ధిని సాధించాలని, ఇతర కుటుంబాలకు సహాయ పడాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీవో నరేశ్, అడిషనల్ డీఆర్డీవో గోవిందరావు, డీపీఎంలు రవి, నారాయణ, సారయ్య, ఏపీఎంలు, జిల్లా సమాఖ్య అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కళాశాలల్లోనే నిష్ణాతులైన అధ్యాపకులు

ఏటూరునాగారం, ఫిబ్రవరి 21 : ప్రభుత్వ కళాశాలల్లోనే నిష్ణాతులైన అధ్యాపకులు ఉంటారని గురుకులాల ఆర్సీవో హరిసింగ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం సీనియర్లకు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆర్సీవో మాట్లాడారు. ఇంటర్ తర్వాత కార్పొరేట్ కళాశాలల్లో రూ.లక్షలు వెచ్చించి చదువుకోవడం కంటే ఉద్యోగ రీత్యా స్థిర పడేందుకు అనేక కోర్సులు ఉన్నాయని వాటిల్లో చేరి ఉద్యోగాలు పొందాలని కోరారు. ప్రైవేటు పాఠశాలల్లో చదివే వారి కంటే గ్రామీణ ప్రాంతాల్లో చదివే విద్యార్థులకు అనేక అంశాలపై పట్టు ఉంటుందన్నారు. కేవలం మార్కులే ప్రాధాన్యం కాదని, విజ్ఞానం కూడా అవసరం అన్నారు. ఎస్సై తాజుద్దీన్, గిరిజన గురుకుల క్రీడా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్, అధ్యాపకులు రాజు నాయక్, శంకర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## సీసీఐ పత్తి కొనుగోళ్లు ప్రారంభం

కాటారం, ఫిబ్రవరి 21 : మండలంలోని రుద్ర, మీనాక్షి జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోళ్లు శుక్రవారం ప్రారంభమయ్యాయి. 20 రోజులుగా పత్తి కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. తిరిగి కొనుగోళ్లు ప్రారంభమవడంతో రైతులు పెద్ద ఎత్తున పత్తిని తీసుకొచ్చారు. పత్తిని పూర్తిగా కొనుగోలు చేసేవరకూ సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం కొనసాగించాలని రైతులు కోరుతున్నారు.

## దేవాదుల పంపింగ్ పునః ప్రారంభం

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 21 : మండలంలోని దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులోని మూడు మోటర్లతో గోదావరి నీటి పంపింగ్ శుక్రవారం పునః ప్రారంభించినట్లు నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. ఫేస్-2 లోని ఒకటి, ఫేస్-3 లోని రెండు మోటర్లను ఆన్ చేసి రోజుకు 834 క్యూసెక్కుల నీటిని భీంఘనపురం రిజర్వాయర్‌లోకి పంపింగ్ చేస్తున్నట్లు చెప్పారు.

## ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

చిట్యాల, ఫిబ్రవరి 21 : మండలకేంద్రం, జూకల్‌లోని ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో తెలంగాణ సాంస్కృతిక నృత్య ప్రదర్శన, చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు ఎంఈవో కొడపాక రఘుపతి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ప్రధానోపాధ్యాయులు శ్రీరాం రఘుపతి, గిరిగాని కృష్ణ, ఝాన్సీరెడ్డి, ఉపాధ్యాయులు డాక్టర్ మహ్మద్ రఫీ, రాధిక, రాణి, గడ్డం శంకర్, సుజాత, నీలిమారెడ్డి, పీడీ సాంబమూర్తి పాల్గొన్నారు.

## ఇసుక క్వారీలకు ఎకో సెన్సిటివ్ ఎన్‌వోసీ ఇవ్వాలి

వాజేడు, ఫిబ్రవరి 21 : జిల్లాలోని అన్ని గిరిజన ఇసుక సొసైటీలకు అటవీశాఖ అధికారులు ఈఎస్‌జెడ్ ఎకో సెన్సిటివ్ ఎన్‌వోసీలు ఇచ్చేలా చూడాలని శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో నిర్వాహకులు వినతిపత్రం అందజేసినట్లు గిరిజన సొసైటీ నిర్వాహకుడు టింగ బుచ్చయ్య ఒక ప్రకటనలో తెలిపారు. సొసైటీలకు అనుమతి ఇచ్చినప్పుడే స్థానిక గిరిజనులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుందని వినతిపత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. దరఖాస్తు స్వీకరించిన ప్లానింగ్ బోర్డ్ చైర్మన్, ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి ఈ ప్రతులను సంబంధిత అధికారులకు పంపించినట్లు పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో ఈసం రాజు, తొర్రెం శ్రీను, రమేశ్, దబ్బకట్ల సుమన్ పాల్గొన్నారు.

## చిత్రలేఖనంలో విద్యార్థి ప్రతిభ

ములుగురూరల్, ఫిబ్రవరి 21 : హైదరాబాద్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి చిత్రలేఖనం పోటీల్లో ములుగు పట్టణానికి చెందిన విద్యార్థి కొత్త రేవంత్ ప్రతిభ చాటాడు. వివిధ రాష్ట్రాల నుంచి చిత్రకారులు పాల్గొనగా రేవంత్ గీసిన చిత్రం అవార్డుకు ఎంపికైంది. గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రేవంత్‌కు ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యులు ప్రశంసాపత్రంతో పాటు నగదు బహుమతిని అందజేశారు.

## టీజీ సెట్ పరీక్ష కేంద్రంగా గురుకుల పాఠశాల

ములుగురూరల్, ఫిబ్రవరి 21 : జాకారం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల పీజీ సెట్ పరీక్ష కేంద్రంగా ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5 నుంచి 9వ తరగతి ప్రవేశాల కోసం ఈ నెల 23న నిర్వహించే ప్రవేశ పరీక్షలో 546 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు.

## తాగునీటి సమస్యకు టోల్ ఫ్రీ నంబర్

ములుగురూరల్, ఫిబ్రవరి 21 : మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడితే పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్ 18005994007ను అందుబాటులోకి తెచ్చినట్లు మిషన్ భగీరథ ఇంట్రా డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్ సుభాష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏమైనా సమస్య తలెత్తితే వెంటనే ఫిర్యాదు చేయాలని ఆయన ప్రజలకు సూచించారు. 24 గంటల్లో సమస్యను పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.

## ఐదో తరగతి ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

భూపాలపల్లిరూరల్, ఫిబ్రవరి 21: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా సమన్వయ అధికారి గోల్కొండ భిక్షపతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి ప్రవేశ పరీక్షతో పాటు 6,7,8, 9వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి 23న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 2,360 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని, ఆరు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు విధిగా హాల్‌టికెట్, ఆధార్ కార్డు, రైటింగ్ ప్యాడ్, బ్లూ, బ్లాక్ పెన్ను, వాటర్ బాటిల్ వెంట తెచ్చుకోవాలని ఆయన సూచించారు.

## విద్యార్థులు చదువుల్లో రాణించాలి

మహదేవపూర్, ఫిబ్రవరి 21 : చదువుల్లో రాణించాలని ఎంఈవో ప్రకాశ్ బాబు విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండలకేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులు, హాజరు రిజిష్టర్లను పరిశీలించారు. పలు భోధనాంశాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అర్థమయ్యేలా సులభ పద్ధతిలో విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.

## అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు

ములుగురూరల్, ఫిబ్రవరి 21 : అక్రమంగా ఇసుకను రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ములుగు డీఎస్పీ రవీందర్ అన్నారు. శుక్రవారం ఆయన మల్లంపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును తనిఖీ చేశారు. రిజిస్టర్‌ను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం జాతీయ రహదారి మీదుగా వెళ్తున్న లారీలను ఆపి తనిఖీ చేశారు. ఆయన వెంట ఎస్సై వెంకటేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

## విద్యుత్ తీగలు అమర్చితే కేసులే..

ములుగురూరల్, ఫిబ్రవరి 21 : వన్య ప్రాణుల కోసం విద్యుత్ తీగలు అమర్చిన వారిపై కఠిన చర్యలతో పాటు బైండోవర్ కేసులు నమోదు చేయనున్నట్లు ఎస్పీ శబరీశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో పోలీస్ శాఖ ద్వారా ఇప్పటికే హెచ్చరికలు జారీ చేశామన్నారు. విద్యుత్ తీగలు అమర్చే వారి సమాచారం ఇస్తే వారికి రూ.5వేల నగదు బహుమతి ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల ములుగు పోలీస్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ తీగలు అమర్చిన వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ చెప్పారు.

## డివైడర్‌ను ఢీకొన్న ట్రాలీ : ఇద్దరికి గాయాలు

భూపాలపల్లి రూరల్, ఫిబ్రవరి 21 : జాతీయ రహదారిపై మైసమ్మ గుడి వద్ద డివైడర్‌ను ట్రాలీ వాహనం శుక్రవారం ఉదయం ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. వరంగల్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు ట్రాలీ వాహనంలో బట్టలు తీసుకొని వస్తుండగా మైసమ్మ గుడి వద్ద డివైడర్‌ను వేగంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో అందులోని వ్యక్తులను గాయాలయ్యాయి. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు గమనించి, వాహనం దిగి గాయపడిన వారి వివరాలు తెలుసుకున్నారు. 108 అంబులెన్స్‌కు ఫోన్ చేసి, క్షతగాత్రులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని భూపాలపల్లి జిల్లా ఆసుపత్రి డాక్టర్ కు సూచించారు.

## కాళేశ్వరంలో దొంగల బీభత్సం

మహదేవపూర్ (కాళేశ్వరం), ఫిబ్రవరి 21 : కాళేశ్వరం గ్రామంలో దొంగలు బీభత్సం సృష్టించారు. ఇటీవల ఓ చికెన్ సెంటర్‌లో కోళ్లతో పాటు సమీప కాలనీలో ఓ ఇంటి తాళం పగలగొట్టి రూ.పది వేల నగదును చోరీ చేసిన విషయం తెలిసిందే.. శుక్రవారం గ్రామంలోని చంద్రశేఖర ఆయల సమీపంలో తాజొద్దీన్ బాబా కూల్ డ్రింక్ షాపులో సుమారు రూ.6 వేల నగదు ఎత్తుకెళ్లారు. మజీద్‌పల్లిలోని పలు ఇండ్ల తాళాలను పగలగొట్టి పరారైనట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. వరుస దొంగతనాలపై పోలిసులు దృష్టిసారించాలని ప్రజలు కోరుతున్నారు.

## రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు విద్యార్థిని ఎంపిక

మహదేవపూర్, ఫిబ్రవరి 21 : మండలకేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని పెద్ద అంజలి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం సరిత తెలిపారు. ఇటీవల భూపాలపల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ కనబర్చి వికారాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా అంజలిని పీడీ గురుసింగ్ పూర్ణిమ, ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయులు మడక మధు, వీరేశం, ఫర్హానా, కౌసర్, సమ్మయ్య, సాహెదా బేగం, ప్రసూన, దీపిక, లీలారాణి, శ్రీనివాస్, ఒలిపాషా, సుధారాణి పాల్గొన్నారు.

## ఇసుక క్వారీల తనిఖీ

మంగపేట, ఫిబ్రవరి 21 : మండలంలోని కత్తిగూడెం, రాజుపేట ఇసుక క్వారీలను శుక్రవారం తహసీల్దార్ రవీందర్, సీఐ శ్రీనివాస్, టీఎస్‌ఎండీసీ పీవో శ్రీకాంత్ బృందం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా వేబిల్‌లు, వివిధ రికార్డులను వారు పరిశీలించి క్వారీ నిర్వాహకులకు సూచనలు చేశారు. ఓవర్‌లోడుతో వాహనాలు పట్టుబడినా, నిబంధనలు పాటించకపోయినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. తనఖీలో ఎస్సై సూరి, ఆర్‌ఐలు శ్రీనివాస్, యేసుపాదం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## వాజేడు ఏజెన్సీలో పోలీసుల హై అలర్ట్!

వాజేడు, ఫిబ్రవరి 21 : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో వరుసగా ఎన్‌కౌంటర్లు జరుగుతున్న నేపథ్యంలో సరిహద్దు ప్రాంతమైన వాజేడు పోలీసులు హై అలర్ట్ అయ్యారు. ఎస్పీ శబరీష్, ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ ఆదేశాల మేరకు శుక్రవారం వెంకటాపురం సీఐ బండారు కుమార్ ఆధ్వర్యంలో ఎస్సై రాజ్‌కుమార్, పోలీసు సిబ్బంది నార్కోటిక్ స్నిఫర్ డాగ్‌టీంతో కలిసి చెరుకురు గ్రామం వద్ద జాతీయ రహదారిపై ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి వెళ్లే ప్రయివేట్ బస్సులతో పాటు, జీపులను ఆపి స్నిఫర్ డాగ్‌తో తనిఖీలు చేశారు. బ్యాగులు తీసి క్షుణంగా పరిశీలించారు. స్థానిక కిరాణా దుకాణాల్లో సోదాలు చేయడంతో పాటు మండలంలో ఎవరైనా గంజాయి అమ్మినా, సేవించిన కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

## మిషన్ భగీరథ పైపులైన్‌కు లీకేజీ

వాజేడు, ఫిబ్రవరి 21 : మండలంలోని గుమ్మడిదొడ్డి గ్రామంలోని పాఠశాల వద్ద మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ అయి నీరు వృథాగా పోయింది. విషయం తెలుసుకున్న వాటార్ గ్రిడ్ సిబ్బంది సాయంత్రం లైన్ బంద్‌చేసి మరమ్మతులు చేసే పనిలో నిమగ్నమ య్యారు.



వృథాగా పోతున్న నీరు